# శత్రు సర్పం

**శనివారం** రాత్రి అంతా మంచి వర్షం పడింది. ఆదివారం మొహమాటంగా సూర్యుడు బయటికి ఒచ్చేడు. వీధిలో తురాయి చెట్లు పచ్చగా చల్లగా ఉన్నాయి. నాలుగవుతూండగా వీధిలో పిల్లలు మూడు కర్రముక్కలు ఇటుకల మధ్య నిలబెట్టి క్రికెట్ ఆడుతున్నారు. వీధి కోలాహలంగా ఉంది. వర్షం వల్ల సిమెంటు రోడ్డు పిచ్ కడిగినట్టుంది. బంతి అటూ ఇటూ కొంపల్లోకి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. ఫుడ్ కార్పొరేషన్ రాజుగారి గేటు దగ్గిర బౌండరీ గీతగీశారు. కొంచెం ఒంగుని నోట్లో చూయింగ్ గమ్ నములుతూ అప్రమత్తంగా నుంచున్నాడు జీషన్. బంతి తన వరకూ రాలేదుగానీ వచ్చినంతపనైంది. జీషన్ వెనక కరెంటు స్తంభానికి అటూ ఇటూ రోడ్డు అంచున రాజుగారు నాలుగు మొక్కలు పెంచుతున్నారు. వాటితోపాటు పచ్చగడ్డి మొలిచి అందంగా ఉంది. ఈ సారి బంతి జీషన్ దగ్గిరికి రాగానే పట్టుకుని అదే ఊపులో ఒక్క కేకతో బౌలర్ వేపు విసిరేడు. ఒకసారి వెనక్కి తిరిగి వీధి పరకాయించి చూసి మళ్లీ గీత దగ్గిరికి ఒస్తూ రాజుగారి గేటు వేపు చూసి కెవ్వుమని కేకపెట్టేడు జీషన్. ఆరు నిముషాల తరవాత క్రికెట్ జట్టుతోపాటు పక్కన ఉన్న ఇళ్ల వాళ్లందరూ. పోగయ్యారు. వాళ్ల ఎదురుగా ఒణికిపోతూ నుంచున్నాడు జీషన్. బాడీలైన్ బౌలింగ్‌లా ప్రశ్నల వర్షం కురుస్తోంది. ఆడవాళ్లు గేట్ల దగ్గిర, బాల్కనీల్లో నుంచున్నారు.

"ఇదో నారాయణా ముందు రాజుగారికి చెప్పండి. ఇంట్లో పిల్లలు కూడా ఉన్నారు." అన్నారు రెడ్డిగారు.

నారాయణ జాగ్రత్తగా గేటు దగ్గిర నుంచుని కాలింగ్ బెల్ నొక్కేడు. నిద్ర కళ్లతో తలుపు తీశారు రాజుగారు.

"రాకండి రాకండి. మీ ఇంట్లోకి పాము జొరబడింది. పిల్లల్ని బయటికి రానివ్వకండి."

రాజుగారి బద్ధకం మీద నారాయణ వాక్యం కొరడాలా పనిచేసింది. భళ్లున తలుపేసుకున్నా డాయన.

"అరె. రాజుగారు తలుపేసుకున్నారండీ."

"పోన్లెండి. ముందు సంగతి చూడండి."

"ఆశ్చర్యంగా ఉంది. అసలు స్నేక్స్ రావడం ఏవిటి?"

"ఎందుకురావు? మొన్నటివరకూ ఇదంతా తోట. రెండు వీధులవతల ఇంకా ఇళ్లు పడనే లేదు - ఒకటీ అరా ఉండ కుండా ఉంటాయా?"

"అంకుల్. మనిద్దరం లోపలికి వెళదాం. రెండు కర్రలున్నాయి. నా దగ్గిర." బాల్కనీలో నుంచుని ఆమె వింది.

"అమ్మో మీరు వెళ్లకండి. పరిగెట్టలేరు కూడాను.ఇవతలకి రండి అసలు."

"రేయి జేషూ అసలు పాముని సరిగ్గా చూశావా?"

"అరె. చూశాన్రా. లోపలికిపోతా ఉంది. బయంవేసి అరిచే."

"ఇదిగో ఏవోయి జీషనూ, బాగా గుర్తు తెచ్చుకో. పాము లోపలికి వెళ్లిందా బయటికి వెళ్లిందా?"

"లోపలికి పోయింది అంకుల్"

"ఒకే. నువ్వు సరిగ్గా చూశావా? ఎలా ఉంది స్నేక్."

"నల్లగా లేదు. తెల్లగా లేదు. పొడుగ్గా ఉంది. అది...."

"తల ఎలా ఉంది? కృష్ణపాదాలు కనిపించాయా?"

"తల సరింగా చూల్లేదు ఆంటీ. కృష్ణ పాదాలంటే?"

"బలేదానివి. పడగవిప్పితేగాని కృష్ణపాదాలు కనిపించవు."

"మీరుండండి. వాణ్ని ఊరికే కంగారు పెట్టకండి. ఏవోయి, తల చూడలేదు గదా?"

"లేదు తాతగారూ."

"పోన్లే. రంగు ఎలా ఉందన్నావు? గోధుమ రంగేనా?"

"గోధుమ అంటే- తెల్లాగాదు. నల్లాగాదు."

"అదర్రా సంగతి. కృష్ణమూర్తిగారూ మీ రేవంటారు?"

"గోధుమరంగు తాచన్నమాట. అంతే అయిఉండాలి."

"సరసర లోనికి పోయిందంకుల్."

అందరూ అంగీకరించారు. ఇంతలో కృష్ణమూర్తిగారి సెల్ మోగింది.

"హలో. ఆ, రాజుగారూ... ఆ, ఉండండి. కంగారు పడకండి. అది గోధుమరంగు తాచు పాము. వెరీ డేంజరస్. మీరు తలుసేపుకున్నారు గదా. ఒకే. పిల్లల్ని బయటికి రానివ్వకండి... చెప్పలేం. మీ బయటి బాత్రూంలో దూరి ఉండొచ్చు..... కంగారు పడకండి. నేను మళ్లీ ఫోన్ చేస్తాను."

రెడ్డిగారన్నారు. "నారాయణా, కచ్చితంగా తాచుపావే నంటావా?"

"సందేహం లేదు. డాక్టరుగారి దగ్గిరికి వెళ్లే టైం కూడా ఉండదు."

"వెనక ఇంటికిగానీ పక్క ఇంటికిగానీ వెళ్లే అవకాశం ఉందా?"

"లేదండి. గోడలకి కన్నాలు లేవు. అదే ఇక్కడే ఎక్కడో దాక్కుని ఉంటుంది."

"రెడ్డి అంకుల్ కొంచెం లోపలికి వెళ్లి చూద్దాం. అంతగా మీదికి వస్తే పారిపోదాం."

"బలేవాడివయ్యా. పక్కనే ఏ పూలకుండీ పక్కనే ఉందనుకో సర్రున లేచి కాటేస్తుంది."

"స్నేక్స్ మన జోలికి రావంటగద అంకుల్."

"ఎందుకురావు? పగబట్టిందంటే అంతే."

"ఇదుగో. నువ్వుండవయ్యా. పెద్దవాళ్లం మేం మటాడుతున్నాం గదా? కృష్ణమూర్తీ ఇప్పుడేది దారి? చీకటి పడిందంటే ఏవీ చెయ్యలేం. ఎంత ప్రమాదమో ఆలోచించు."

బాల్కనీల నుంచి ఆడవాళ్లు అరిచేరు.

"ముందాపిల్లల్ని దూరంగా పొమ్మనండి."

రెడ్డిగారి భార్య అవతల ఇంటిగేటు దగ్గిర నుంచుని కేకేసింది.

బాబూ జీషన్, నానీ ఓసారిలా రండి."

చెయ్యి ఊపి ఇద్దరూ రెడ్డిగారింటికి వెళ్లి రెండు నిముషాల్లో రెండుట్రేలలో ప్లాస్టిక్ గ్లాసుల్లో టీ తెచ్చేరు.

"ఓహో. రెడ్డిగారూ, అక్కగారికి థేంక్స్ చెప్పండి." అన్నాడు కృష్ణమూర్తి. రెడ్డిగారు నవ్వి అన్నాడు.

"దానికేవుందిగానండీ, ఇప్పుడేం చేద్దావంటారు? వారన్నట్టు చీకటిపడిందంటే వీధిలో నడవలేం." మళ్లీ కృష్ణమూర్తిగారి సెల్ సారేజహాసే అచ్ఛా అంది.

"ఆ రాజుగారూ....... లేదింకా. ఆలోచిస్తున్నాం. నేనే మీకు చేస్తాను. అది కచ్చితంగా గోధుమ తాచని తేలిపోయింది. ఏవీ సందేహం లేదంటున్నారు. ముందూ వెనకా కాసేపాగి అన్ని లైట్లూ వేసి ఉంచండి."

"బాగానే ఉంది. ఆయనింట్లో హాయిగా కూచుని ఫోన్లు చేస్తే ఎలాగండీ? పాము ఆయనింటోకి జొరబడిందిమనింటోకి గాదు."

"పోనీలెండిసార్. ఇది మనందరి సమస్య అనుకుందాం. మనవేగదా ఆయన్ని లోపలుండమన్నాం."

"ఊ. పెద్ద ప్రమాదం వచ్చిపడిందయ్యా ఊ... రెడ్డిగారూ ఓ పనిచేస్తారా? అందరికంటే మీరు పొడుగు. ఏవీ లేదు. గేటు దగ్గిరికి వెళ్లి పరిశీలనగా ఓసారి చూస్తారా?"

"టీ తాగి గ్లాసు కాలవలోకి విసిరేసి సిగరెట్టు వెలిగించబోయి ఆగిపోయాడు రెడ్డిగారు. అవునన్నట్టుగా తలూపేడు నారాయణ. కృష్ణమూర్తి కూడా బాగానే ఉందన్నారు.

"నేను గేటు ఎక్కి చూస్తానంకుల్. నాకు కనబడితే ఎలా ఉందో చెప్తా" అన్నాడు జీషన్. బౌలరూ, బేట్స్‌మన్, వికెట్ కీపరూ దీన్ని సమర్థించారు. బౌలరు ధైర్యం చేసి అన్నాడు.

"వాడు సరిగ్గా చూడలేదు అంకుల్. పాములు పగబట్టవని మా సారు చెప్పేరు. పాలు కూడా తాగదంట."

"ఏవయ్యా పాలు తాగకపోతే టీ తాగుతుంది. అసలు పాము కరుస్తుందని చెప్పేడా మీ సారు?"

"ఇదిగో మీరు కాసేపు మాట్లాడకండి." పెద్దాయన మాటలు విని కుర్రాళ్లు ఊరుకున్నారు. కానీ రెడ్డిగారికి మాత్రం జీషన్ సలహా బాగా నచ్చింది. సిగరెట్టు వెలిగించే దాయన కృష్ణమూర్తిగార న్నారు.

"కుర్రాళ్లు కాసేపు మాట్లాడకండయ్యా. రెడ్డిగారూ, మనం తొందరపడి ఏదో ఒకటి చెయ్యాలి. ఏవంటే నేను బయటికి వెళ్లాలి."

"ఒకటి వినండి దాన్ని మనం ఒదిలిపెట్టగూడదు. కొంపల్లో దొరబడుతుంది. దాని అంతుచూసిగాని ఇళ్లకి వెళ్లం. శత్రుశేషం పితృశేషం అన్నారు పెద్దలు. అది ప్రమాదకరమైన గోధుమ తాచుపామని అనుకున్నాం గదా?

"నిజవే. ఒకసారి పాము ఇంట్లోకి చేరిం తరవాత చూస్తూ ఊరుకుంటావా? మనం అటు వెళ్లగానే బయటి కొచ్చి నారాయణగారి కారుషెడ్డులో దూరితే?"

"సరే లెండి. దాన్ని ఎలాగో ఒకలాగ చంపుదాం. ముందు రెడ్డిగారూ ఆయనన్నట్టు మీరోసారి గేటు దగ్గిర నుంచుని లోపలికి చూడగలరా?"

రెడ్డిగారు ఒకసారి గేటువేపూ ఒకసారి ఆయన ఇంటివేపూ చూశారు. ఆమె గేటు దగ్గిర లేదు. లుంగీ గూడకట్టు కట్టుకుని గేటువేపు నడిచేరు రెడ్డిగారు. ఆయన మెదడులో విచిత్రమైన ఆలోచన మెరిసి యాయమైంది. 'అసలు దీన్ని చంపడం అవసరమా? కుర్రాడు తప్ప ఎవరూ చూడలేదు!

"నుంచోండి. గేటు శబ్దం చెయ్యకండి." అన్నాడు నారాయణ. దరిదాపు ఆగిపోయారు రెడ్డిగారు.

"చీకటిపడుతుంది. మబ్బేసుకొస్తోంది కూడాను." ప్రోత్సాహకరంగా అన్నారు తాతగారు. రెడ్డిగారు గేటుదగ్గిరికెళ్లి నుంచున్నాడు. పొడగరి ఆయన. దరిదాపు గేటు నానుకుని లోపలికి చూశారు. గుమ్మం వరకూ అటూ ఇటూ పూలకుండీలు. ఇంటి చుట్టూ మెత్తగా పెరిగిన గడ్డి. దాని మధ్య నుంచి నడవడానికి వీలుగా సిమెంటు కాలి దారి. హఠాత్తుగా రాజుగారి కిటికీ తెరిచి పెద్దగా కేకేశారు.

"రెడ్డిగారూ, ఏవిటీ లోపలి కొస్తోందా?"

తుళ్లిపడ్డారు రెడ్డిగారు. రాజుగారి మాటలు టపాకాయల్లా పేలేయి. లేదన్నట్టు చెయ్యి ఊపి, ఊపిరి తీసుకుని పరీక్షగా ముందు పూల కుండీల వెనక కళ్లు చికిలించి చూశారాయన. రెండువేపులా చూపుల్తో గడ్డి పెకిలించి మరీ చూసినా ఏవీ కనిపించలేదు. కళ్లు తుడుచుకుని మళ్లీ జాగ్రత్తగా మెట్ల పక్క సిటౌట్ గోడ చివర వరకూ పరీక్షగా చూస్తూండగా గతుక్కుమన్నారు రెడ్డిగారు. గుండె ఝల్లుమంది. గోడ వంపులో గోధుమ రంగులో కదలిక స్పష్టంగా కనిపిస్తోంది. మెల్లిగా వెనక్కి తిరిగి రెండడుగులు ముందుకేసి "గోడవార ఏదో కదుల్తూ కనిపిస్తోంది" అన్నారు. అందరూ ఒకేసారి 'ఆ' అన్నారు. నరాలు బొంగరానికి చుట్టినట్టు.

"చూడండి మళ్లీ."

రెడ్డిగారు లుంగీ చివరతో నుదురు అద్దుకుని మళ్లీ గేటు దగ్గిరికి వెళ్లి లోపలికి చూశారు. గోడవార కదలిక కనిపస్తూనే ఉంది. కళ్లు తుడుచుకుని వెనక్కి చూశారు. అందరూ అయిదారు గజాల వెనక్కి ఉన్నారు. మళ్లీ లోపలికి చూశాడాయన. చల్లటి గాలి రెడ్డిగారి వీపుని తాకింది. గోడవార ఎండుకొబ్బరాకు కదిలింది. వెనక్కి తిరిగొచ్చి "అబ్బే లేదండీ, ఎండిపోయిన కొబ్బరాకు." అన్నారు.

"ఏవిటి, సరిగ్గా చూశారా?"

"ఆ. మొదట పొరబడ్డాను. పోనీ ఓసారి మీరు కూడా చూడండి." పెద్దాయన గంభీరంగా అన్నాడు. "రెడ్డిగారూ... ఇంక లాభం లేదు. పనులు మానుకుని ఎంతసేపు నుచుంటాం ఇక్కడ. ఏదో ఒకటి చెయ్యండి."

"అయితే ఏ వంటారు?"

నారాయణ అన్నాడు: "ఈ డిస్కషన్లు పెట్టుకుంటే చీకటిపడుతుంది. అందుకని కృష్ణమూర్తిగారి స్కూటరేసుకుని గుడి సెంట్ర కెళ్లి ఏ రిక్షావాణ్నో తీసుకొచ్చి లోపలికి పంపిద్దాం. రాజుగారు ఇచ్చుకుంటారు లెండి."

"గుడ్" అన్నారు రెడ్డిగారు.

"తాచుపాము. ఎవరు ధైర్యం చేస్తారండీ" అన్నాడు కృష్ణమూర్తిగారు.

"సరే. చేసేవాడే చేస్తాడు. ఊరికే చెయ్యమనం గదా?"

"పద పద."

నారాయణ, కృష్ణమూర్తీ స్కూటరేసుకుని వెళ్లేరు. వెళ్లేటపుడు వెనక్కి తిరిగి "జార్తగా చూస్తూండం"దని చెప్పేడు నారాయణ. వాళ్లకి సుబ్రహ్మణ్యంగారూ, కృష్ణారావుగారూ స్కూటర్ల మీద ఎదురొచ్చేరు. మరో పదినిముషాల్లో వీధి చివర ఇళ్ల నుంచి ఇద్దరు ముగ్గురొచ్చి సమావేశంలో కూచున్నారు. అందరూ వలయాకారంలో నుంచుని జీషన్ చేత కూలంకషంగా పాముని చూడ్డం, గుర్తించడం, సంహార కార్యక్రమ ప్రయత్నాలతో సహా చెప్పించుకున్నారు.

"ప్చ్. ఎవరి దగ్గిరా గన్ లేదు. షూట్ చేసి పారెయ్యొచ్చు." అన్నాడు కృష్ణారావు.

"బలేవాడివి. గన్నూ లేదు. ఆ పామెక్కడుందో తెలీదు."

"లోపల ఎక్కడో ఉంది. కనిపించడం లేదంతే."

మళ్లీ సుబ్రహ్మణ్యం అన్నాడు "అసలు అది ఎలా వచ్చిందంటారు? ఇక్క డెక్కడా పుట్టలు పెట్టే అవకాశం లేదు."

"పాములెప్పుడూ ఇళ్ల పక్కనే పెట్టవు పుట్టలు. ఎక్కణ్నించి వస్తే ఏం? లోపలికి జొరబడింది. ఐ హేట్ స్నేక్స్."

"అంకుల్ స్నేక్స్ ఆర్ ఫ్రండ్స్ ఆఫ్ ఫార్మర్స్."

"బట్ నాట్ అవర్ ఫ్రెండ్స్. ఇప్పుడు దాన్ని చంపకపోతే ఎంత డేంజరస్ అంటావ్?"

"గోధుమరంగు తాచంట అంకుల్."

"గోధుమో, ఎరుపో ఎక్కణ్నించి వచ్చిందో మనకనవసరం. మన సేఫ్టీ చూసుకోవాలయ్యా."

సమావేశం రెండు చిన్న బృందాలుగా విడిపోయింది. పాముల గురించీ పాముల పగ గురించీ, పాముల నర్సయ్యగారి గురించీ, మున్సిపాలిటీ గురించీ చర్చలు సాగుతున్నాయి. ఈలోగా వెనకాలే చీకటి ఒచ్చిపడింది. ఎవరూ గమనించలేదు. తాతగారికీ రెడ్డిగారికీ ఎవరో కుర్చీలు పంపించారు. గేటుకి దూరంగా వేసుకున్నారు. కాసేపట్లో సందు తిరిగి కృష్ణమూర్తీ, నారాయణా ఒచ్చేరు. స్కూటరు ఆగీ ఆగ్గానే పెద్దాయన అడిగేడు.

"ఎవడేనా దొరికేడా?"

"అయ్యా అక్కడ ఎవరూ లేరండి. పైకి వెళ్లి గూడా వచ్చేం. ఎవడూ దొరకలేదు. చివరికి ఓ రిక్షావాడు దొరికేడు. డబ్బులిస్తాంరా బాబూ అన్నా రాలేదు."

"ఏం?"

"మీరూ మీరూ చూస్కోండి అన్నాడు. సుబ్రహ్మణ్యం ఏం చేద్దావంటావు?"

మళ్లీ రెండు బృందాలూ ఒకటై పోయాయి. సర్పసంహారం గురించి చర్చకొనసాగింది. ఇంకొంచెం పొద్దుపోయింది. ఈసారి కృ.మూ.గారి ఇంటి నుంచి అందరికీ టీలొచ్చేయి.

❖ ❖ ❖